సాక్షి
గుంటూరు
శనివారం । 27 । జనవరి । 2024




దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏ.వి. శేషసాయి శుక్రవారం దర్శించుకున్నారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌లో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,000.గరిష్ట ధర రూ.4,300.మోడల్ ధర రూ.3,600 వరకు పలికింది.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 520.20 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చిల్లపల్లి

పట్నంబజారు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా చిల్లపల్లి మోహన్‌రావును నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. ఈ మేరకు శుక్రవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ చేశారు. చిల్లపల్లి మోహన్‌రావును బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా నియమించారు.

ఆత్మాభిమానం నుంచే జాతీయ జెండా ఆవిర్భావం

పింగళి వెంకయ్య మనవడు జీవీఎస్ నరసింహం



పిడుగురాళ్ల: బ్రిటిష్ సామ్రాజ్యంలో స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న ప్రజల ఆత్మాభిమానమే ఆత్మగా మారి ఉద్భవించిందే జాతీయ జెండా అని జాతీయ జెండా రూపకర్త పింగళి వెంకయ్య మనవడు జీవీఎస్ నరసింహం అన్నారు. పట్టణంలోని ఏబీసీ సీబీఎస్‌సీ స్కూల్‌లో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జీవీఎస్ నరసింహం హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తాతగారైన పింగళి వెంకయ్య జెండా రూపకల్పన చేయటమే కాకుండా స్వాతంత్ర్యం సమర యోధుడుగా జాతిపిత మహాత్మ గాంధీతోపాటు అనేక ప్రాంతాల్లో సంచరిస్తూ, దేశ సేవయే పరమవధిగా జీవించారని తెలిపారు. అనేక మందిలో దేశభక్తి రగిలించారన్నారు. అనంతరం పాఠశాల స్కూల్ డైరెక్టర్ జేకే అయ్యంగార్, ప్రిన్సిపాల్ రమాదేవి, శ్రీధర్ కుమార్‌లు జీవీఎస్ నరసింహంకు జ్ఞాపికను అందజేసి దుశ్శాలువాతో సత్కరించారు. అలాగే నరసింహం చేతుల మీదుగా పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆక్టోపస్ కార్యాలయంలో గణతంత్ర వేడుకలు

సాక్షి, అమరావతి: రాష్ట్ర ఆక్టోపస్ కార్యాలయంలో 75వ గణతంత్ర వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ(అడ్మిన్) ఎం .నాగేశ్వరరావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉత్తమ పనితీరు కనబరిచిన ఎస్పీ(ట్రైనింగ్) బి.రవిచంద్రకు ఉత్తమ సేవా పతకం, ఇన్స్‌పెక్టర్ కేవీపీ ప్రసాద్, హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లుకు సేవా పతకం, ఇన్స్‌పెక్టర్ ఆర్సీ నాయక్, కానిస్టేబుల్ ఎం .సూర్యనారాయణలకు డీజీపీ సిల్వర్ డిస్క్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి మస్తానయ్య ఉరుసు మహోత్సవాలు



పాత గుంటూరు : జీటీ రోడ్డులోని హజరత్ కాలే మస్తాన్ షా 132వ ఉరుసు మహోత్సవాలు ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా ధర్మకర్త రావి రామ్మోహనరావు తెలిపారు. దర్గాలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 28న నూతన చాందిని అలంకరణ, రాత్రి గంధం ఊరేగింపు, 29న గంధం పంపిణీ, దీపారాధన 30న ఖురాన్ పఠనం, బాబా వారి ప్రసాదం పంపిణీ 31న ఫకీర్లకు బాబా వారి శేష వస్త్రాల పంపిణీ 1న బాబా ఆశీనులైన కుర్చీని యథాస్థానంలో ఉంచనున్నట్లు తెలిపారు. ప్రతిరోజు విశేష ప్రార్థనలు , భక్తులకుఅన్న ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో దూండీశ్వరి, మస్తాన్‌రావు తదితరులు పాల్గొన్నారు

35 మంది ఎంపీడీఓలకు స్థానచలనం

గుంటూరు ఎడ్యుకేషన్ : ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒకేచోట మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న 35 మంది ఎంపీడీవోలను వేర్వేరు జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఏ. సూర్యకుమారి శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఒకే స్థానంలో మూడేళ్లకు పైబడి పని చేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని ఎన్నికల సంఘం ఇచ్చిన ఆదేశాల మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 12 మందిని ఉమ్మడి కృష్ణా నుంచి 23 మందిని ఉమ్మడి ప్రకాశం జిల్లా జిల్లాకు బదిలీ చేశారు.

సమష్టి కృషితో సమున్నతి



జాతీయజెండా ఎగురవేసి సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ ఆరిఫ్, జేసీ రాజకుమారి



గణతంత్ర వేడుకలను తిలకిస్తున్న నగర ప్రజలు

ఘనంగా గణతంత్ర వేడుకలు
- జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు
- జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి
- జాతీయ జెండా ఆవిష్కరణ
- అభివృద్ధికి అద్దం పట్టిన శకటాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: గుంటూరు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడుస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం గుంటూరు పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ జాతీయజెండాను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. మహాత్మాగాంధీ కలలుకన్న గ్రామస్వరాజ్యంలో భాగంగా ప్రవేశపెట్టిన గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థలో భాగంగా జిల్లాలో 262 గ్రామ సచివాలయాలు, 306 వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి 543 సేవలు ఒకేచోట లభించే విధంగా చర్యలు చేపడుతున్నామన్నారు. జిల్లాలో 39,870 మంది రైతులకు రూ.47.29 కోట్లను పెట్టుబడి రాయితీ కోసం వ్యవసాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందన్నారు. ఉద్యాన పంటలు నష్టపోయిన 12,993 మంది రైతులకు రూ.14.44 కోట్లు పెట్టుబడి రాయితీ కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. గుంటూరు ఛానల్ పొడిగింపు పనుల కోసం రూ.652.78 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. జిల్లా ప్రజాపంపిణీ వ్యవస్థ పరిధిలో 3,495 కొత్త బియ్యం రేషన్ కార్డులను మంజూరు చేశామన్నారు.

34,699 మందికి భూహక్కు పత్రాలు..

చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఒక జిల్లా – ఒక ఉత్పత్తి విభాగంలో మంగళగిరి చీరకు జాతీయ స్థాయి అవార్డు రావడం గర్వకారణమన్నారు. వైఎస్సార్ నేతన నేస్తం కింద 769 మంది లబ్ధిదారులకు రూ.1.85 కోట్లు నేరుగా ఖాతాల్లో వేయడం జరిగిందన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో రూ.30.17 కోట్ల ఖర్చుతో ఏడు సబ్‌స్టేషన్లు నిర్మించడం జరిగిందన్నారు. రీ సర్వేలో భాగంగా 61 గ్రామాల్లో రీసర్వే పూర్తయి 34,699 మంది పట్టాదారులకు భూహక్కు పత్రాలు పంపిణీ చేశామన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొదటి దశలో గ్రామీణ ప్రాంతాలలో 212, పట్టణ ప్రాంతాలలో 223 క్యాంపుల ద్వారా రెండ లక్షల మందికి పలు చికిత్సలు అందించామన్నారు. రెండవదశలో 23,900 మందికి వివిధ చికిత్సలు అందాయన్నారు.

70,444 మందికి ఇళ్ల మంజూరు..

నవరత్నాలు పేదలందరికి ఇళ్లు కార్యక్రమంలో మొత్తం 70,444 ఇళ్లు మంజూరయ్యాయని, ఇప్పటి వరకు 16,688 పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. జగనన్న కాలనీలలో రూ.88.98 కోట్లతో మౌలిక సదుపాయల కల్పన జరుగుతోందన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో అమృత్ పథకం ద్వారా రూ.33.53 కోట్లతో విలీన గ్రామాలైన గోరంట్ల, రెడ్డిపాలెం ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. ఈఏడాది రూ.123 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. మనబడి నాడు–నేడు రెండోదశలో భాగంగా జిల్లాలోని 562 పాఠశాలల్లో రూ.216 కోట్లతో చేపట్టిన పనులు తుదిదశకు చేరుకున్నాయన్నారు.

ఆకట్టుకున్న అభివృద్ధి శకటం..

జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న ప్రజాప్రతినిధులు, అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం పలు పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన కళారూపాలు ఆకట్టుకున్నాయి. జిల్లా అభివృద్ధికి అద్దం పట్టేవిధంగా వివిధ విభాగాల శకటాలను ప్రదర్శించారు. విధి నిర్వహణలో ప్రతిభ కనపరిచిన 476 మందికి ప్రశంసా పత్రాలను జిల్లా కలెక్టర్ అందచేశారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జేసీ జి.రాజకుమారి, మున్సిపల్ కమిషనర్ కీర్తి చేకూరి, సబ్‌కలెక్టర్ ప్రకర్, జిల్లా అడిషనల్ ఎస్పీ సుప్రజ, డీఆర్‌ఓ చంద్రశేఖర్, అధికారులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు



పాత గుంటూరు: గుంటూరు నగరంపాలెంలోని పరేడ్ మైదానంలో శుక్రవారం జరిగిన 75వ గణతంత్ర వేడుకల్లో వివిధ విద్యాలయాలకు చెందిన చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రథమ స్థానాన్ని శ్రీ వేంకటేశ్వర బాలకుటీర్, ద్వితీయ స్థానాన్ని సెయింట్ జోసఫ్ బాలికల ఉన్నత పాఠశాల, తృతీయ స్థానంలో శారదానికేతన్ ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల బహుమతులను దక్కించుకున్నాయి. జిల్లా అభివృద్ధిని తెలిపే శకటాలు, వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్ ఆకట్టుకున్నాయి. శకటాల్లో రవాణా శాఖ మొదటి బహుమతి, రెవెన్యూశాఖ జాతీయ ఓటర్ల దినోత్సవం రెండో బహుమతి, జిలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖ శకటానికి మూడో బహుమతి లభించాయి. జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఎమ్మెల్సీలు చంద్రగిరి ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎంపీ యలమంచలి శివాజీ, జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్ కలెక్టర్ ప్రకార్ జైన్, అడిషనల్ ఎస్పీ సుప్రజ, డీఆర్‌ఓ కె.చంద్రశేఖర్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న గృహ నిర్మాణ సంస్థ శకటం



రైతులకందే సేవలను ప్రతిబింబించేలా ఆర్బీకే శకటం



జగనన్న ఆరోగ్య సురక్ష శకటం

భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకు ఆదర్శం

రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



జాతీయ జెండా ఆవిష్కరించి, గౌరవ వందనం చేస్తున్న మంత్రి రజిని

పట్నంబజారు: భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వేడుకలు నిర్వహించారు. మంత్రి రజిని మువ్వెన్నల పతాన్ని ఆవిష్కరించి, అక్కడే ఉన్న చిన్నారులతో సరదాగా కొద్దిసేపు ముచ్చటించారు. అనంతరం మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలే నేటి స్వేచ్ఛావాయువులని తెలిపారు. 1950వ సంవత్సరంలో మన రాజ్యాంగం అమలులోకి వచ్చిందని, ఆనాటి నుంచి నేటి వరకు మన దేశం అభివృద్ధి పథంలో సాగిందని పేర్కొన్నారు. అన్ని రంగాల్లో గణనీయమైన మార్పులు సాధించగలిగామన్నారు. పేదరిక నిర్మూలన, సామాజిక సమానత్వం ద్వారానే మనం రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడిన వాళ్లం అవుతామని స్పష్టం చేశారు. పేదలు తలెత్తుకుని తిరిగిన రోజు అమరవీరుల ప్రాణ త్యాగాలకు నిజమైన ఫలితం దక్కినట్లు అవుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావజాలంతో, దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్తుతున్నారన్నారు. పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ప్రతి అడుగు వేస్తూ.. పేదలకు నేనున్నానే భరోసాని కల్పించారన్నారు. సామాజిక న్యాయసాధన దిశగా విజయవతంగా ముందుకెళుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ నేతలు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు, డైరక్టర్‌లు, సచివాలయాల కన్వీనర్‌లు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

కూలిన బతుకులు..!

- పొట్టకూటికి వెళ్లి.. ప్రాణాలు వదిలి..
- ఆర్టీసీ బస్సును ఢీకొన్న కూలీలతో వెళ్తున్న ఆటో
- ఒకే ఊరికి చెందిన ముగ్గురు మృత్యువాత
- ఒకరి పరిస్థితి విషమం.. 12 మందికి గాయాలు
- శోకసంద్రంగా వేలూరు గ్రామం



చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రి వద్ద విలపిస్తున్న మృతుల బంధువులు





మృతులు శివపార్వతి, హనుమాయమ్మ (ఫైల్)

చిలకలూరిపేట, యడ్లపాడు: వారంతా వ్యవసాయ కూలీలు...రెక్కాడితేగాని డొక్కాడని నిరుపేదలు. రోజుమాదిరిగానే ఉదయాన్నే కూలి పనులకు ఆటోలో బయలుదేరారు. కొద్దిసేపట్లోనే మృత్యువు వారిలోని ముగ్గురిని తన ఒడిలోకి చేర్చుకోగా.. మరో 13 మంది ఆస్పత్రి పాలయ్యారు. వివరాల్లోకి వెళితే.. చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామానికి చెందిన 16 మంది వ్యవసాయ కూలీలు గ్రామం నుంచి ఆటోలో మిర్చి కోతల నిమిత్తం నాదెండ్ల మండలం అప్పాపురం గ్రామానికి శుక్రవారం బయలుదేరారు. ఆటో మార్గమధ్యంలోని గణపవరం డొంకనుంచి లింగంగుంట్ల గ్రామం వద్ద నరసరావుపేట రహదారిలోకి ప్రవేశిస్తోంది... సరిగ్గా అదే సమయంలో చిలకలూరిపేట వైపునకు ఆర్టీసీ బస్సు వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ఆటోపైకి ఎక్కడంతో కూలీలంతా ఆటోలో చిక్కుకుపోయి హాహాకారాలు చేశారు. ఇది గమనించిన స్థానికులు పరుగున వచ్చి బస్సులోని జనాన్ని కిందకు దించి, ఆటోపై నుంచి బస్సును పక్కకు తొలగించారు. ఈ ఘటనలో ఆటోలో డ్రైవర్ పక్కనే కూర్చున్న ఏకసిరి హనుమాయమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందింది. మిగిలిన వారిని 108 వాహనం సహాయంతో చిలకలూరిపేట ఏరియా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇందులో గన్నవరపు శివపార్వతి(60) చికిత్స పొందుతూ మృతి చెందింది. తీవ్రంగా గాయపడిన షేక్ హజరత్‌వలి, సరుగుల కోటేశ్వరమ్మలను గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ హజరత్‌వలి (60) కన్నుమూశాడు. కోటేశ్వరమ్మ పరిస్థితి విషమంగా ఉంది. కాగా ఆటో డ్రైవర్ షేక్ సుభానితో పాటు గాయపడిన పాలెపు రజిని, ఎస్.పార్వతి, షేక్ వలిమా, బేతంచర్ల మల్లేశ్వరి, పాలెపు శారద, షేక్ జాన్‌బీ, షేక్ ఖాదర్‌బీ, షేక్ మహబూబ్‌బీ, షేక్ మస్తాన్‌బీ, గోరంట్ల శివకుమారి, షేక్ బాజీలకు చికిత్స అందిస్తున్నారు. బాధితులంతా వేలూరు గ్రామానికే చెందిన వారు కావడంతో ఆ గ్రామస్తులతో ప్రభుత్వాసుపత్రి ప్రాంగణం నిండిపోయింది. మృతుల బంధువుల రోదనలతో విషాదఛాయలు అలు ముకున్నాయి. చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సహృదయత చాటుకున్న మల్లెల...

సమాచారం అందుకున్న వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆస్పత్రికి చేరుకొని బాధితులను పరామర్శించారు. మృతి చెందిన కుటుంబాలకు తన వ్యక్తిగతంగా ఒక్కొక్కరికీ రూ.లక్ష చొప్పున రూ.3 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.20వేలు చొప్పున అందజేశారు. అదేవిధంగా ప్రభుత్వసాయం అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ఒక్కొక్కరిదీ ఓ విషాద గాథ...

- శివపార్వతికి ముగ్గురు కుమార్తెలు. ముగ్గురికీ వివాహాలు అయ్యాయి. భర్త నాలుగేళ్ల కిందట కిడ్నీ వ్యాధితో మృతి చెందాడు. ఒక్కదానినే అన్న బాధను దిగమింగుకుని కూలి పనులు చేసుకుంటూ జీవిస్తుంది. సంక్రాంతి పండుగకు కుమార్తెలు రాకపోవడంతో దిగులుగా ఫోన్లు చేయడంతో గత ఆదివారం నాడు వచ్చి అంతా అమ్మను పలకరించారు. ఆరోజు తల్లి తమపై చూపించిన ఆప్యాయతే చివరిదని గ్రహించలేకపోయామంటూ కుమార్తెలు తలుచుకుంటూ కన్నీళ్ల పర్యంతమయ్యారు. గాయాలతో ఆస్పత్రికి వచ్చాకా కడసారి చూస్తూనే కన్నుమూసిందయ్యా అంటూ రోదించారు.
- ఏకసిరి హనుమాయమ్మకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. అందరికీ వివాహాలు జరిగినా అంతా కలిసే ఉంటారు. అందరికీ ఒకటే కట్టు, ఒకటే మాట. అందరూ పనులకు వెళ్లొద్దన్నా.. ఊరికే కూర్చుంటే ఏమోస్తుంది నలుగురితో కలిసినట్టు ఉంటుంది. వచ్చే కూలి కుటుంబానికి కొంత చేదోడువాదోడుగా ఉంటుందంటూ కొద్దికాలంగా గ్రామస్తులతో కలిసి మిరప కోతలకు వెళ్తుంది. ఇంటి పెద్దదిక్కు దూరమైందని కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు.
- మృతుడు షేక్ హజరత్‌వలి, సాబిరా దంపతులకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. తాపీపనులు చేస్తూనే అందరికీ వివాహాలు చేశాడు. ఎవరి కుటుంబాలు వారివి అయ్యాయి. ప్రస్తుతం ఆయనకు భార్య పని చేసే పరిస్థితి లేదు. తనకు 70 ఏళ్లు రావడంతో తాపీ పనులు చేయలేక వ్యవసాయ పనులకు వెళ్తూ భార్యను పోషించుకుంటున్నాడు. కొద్దికాలం కిందట కొడుకు, ఇప్పుడు భర్త చనిపోవడంతో సాబిరా పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

త్యాగధనులను స్మరించుకోవాలి



మాట్లాడుతున్న హెనీ క్రిస్టినా, చిత్రంలో సీఈఓ మోహనరావు

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: దేశ స్వాతంత్ర్యం కోసం తమ ప్రాణాలను ధారపోసిన త్యాగ ధనులను నిత్యం స్మరించుకోవాలని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. ఉమ్మడి జెడ్పీ కార్యాలయంలో నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో జెడ్పీ సీఈఓ జె.మోహన్ రావు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ రాజ్యాంగం మనకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఇచ్చిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్న జెడ్పీ ఉద్యోగులను అభినందించిన హెనీ క్రిస్టినా ఉత్తమ సేవలందించిన పలువురు జెడ్పీ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

జయహే.. జయ జయహే..



గుంటూరు పోలీస్ పరెడ్ గ్రౌండ్ లో శుక్రవారం జరిగిన రిపబ్లిక్ డే ఉత్సవాలలో కలెక్టర్ వేణుగోపాలరెడ్డి నుంచి ప్రశంసాపత్రం స్వీకరిస్తున్న ఏఎస్పీ సుప్రజ, పక్కన జేసీ రాజకుమారి, ఎస్పీ ఆరిఫ్ హాఫిజ్



ప్రశంసాపత్రం తీసుకుంటున్న ఆర్డీఓ శ్రీకర్ | డీఆర్వో చంద్రశేఖరరావు | జెడ్పీ సీఈఓ మోహన్‌రావు | డీఎస్ఓ పద్మ | సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు | ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ విజయకుమార్ | డీటీఓ షేక్ కరీం | డిజేబుల్ వెల్ఫేర్ ఏడీ సువార్త | లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహిపాల్‌రెడ్డి | డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్ రాజగోపాలరావు | డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్

గుంటూరులో గణతంత్రవేడుకలు అంబరాన్నంటాయి. మన మువ్వన్నెల జెండా ఎగిరేది గాలితో కాదు అమర వీరుల శ్వాసతో అన్న పలుకులతో సభాప్రాంగణం చప్పట్లతో మారుమ్రోగింది. ఈ సందర్భంగా విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిన యంత్రాంగానికి కలెక్టర్ వేణుగోపాలరెడ్డి, ఎస్పీ ఆరిఫ్ హఫీజ్‌లు ప్రశంసాపత్రాలను స్వయంగా అందజేశారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు



జిల్లా ఉపాధి కల్పన అధికారి రఘు | జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రెటరీ ఝాన్సీలక్ష్మి | సివిల్ సప్లయిస్ డీఎం లక్ష్మి | వెస్ట్ తహసీల్దార్ సాంబశివరావు



పొన్నూరు తహసీల్దార్ శ్రీకాంత్ | ఈస్ట్ తహసీల్దార్ నగేష్ | మంగళగిరి తహసీల్దార్ రాంప్రసాద్ | మండల ఆర్ఐ, మోహన | డెర్మటాలజిస్ట్, డాక్టర్ శ్రీనివాసరావు | నాట్కో చైర్మన్ సదాశివరావు | మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ టీటీకె.రెడ్డి | డాక్టర్ రత్నమన్ మోహన్ | జీజీహెచ్ ఏఓ ప్రవీణ్‌కుమార్ | మెడికల్ ఆర్డీ ఆఫీస్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి | ఆరోగ్యశ్రీ డీసీ గోపాల్ | బయోమెడికల్ ఇంజనీర్ చంద్రశేఖర్ | సోషల్ సర్వీస్ రవిచంద్ర | ఐ అండ్ పీఆర్ ఏఈఐఈఈ షేక్ మస్తాన్

క్లుప్తంగా

దేశాభివృద్ధే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలి

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ నరసింహా రెడ్డి



మాట్లాడుతున్న నరసింహా రెడ్డి

పాత గుంటూరు: ప్రతీ ఉద్యోగి దేశాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 7.952 కోట్ల పన్ను వసూళ్లను సాధించడమే లక్ష్యంగా ఉద్యోగులు కృషి చేయాలని సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి పేర్కొన్నారు. 75వ రిపబ్లిక్ డే సందర్భంగా శుక్రవారం కన్నవారితోటలోని జీఎస్టీ భవన్లో కమిషనర్ జాతీయ జెండాను ఆవిష్కరించి ప్రసంగించారు. దేశాభివృద్ధికి పన్ను వసూళ్లే కీలకమన్నారు. జీఎస్టీనే దేశానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉందని, దానితోనే భారత ఆర్థిక వవస్థ మరింత పుంజుకుంటుందన్నారు. ప్రతి ఉద్యోగి దేశాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలని సూచించారు.

గుంటూరు సీజీఎస్టీ (ఉప-7) కమిషనరేట్ పరిధిలోని కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జనవరి 25 నాటికి రూ.5.835 కోట్ల జి.ఎస్.టి వసూళ్లు వచ్చాయని కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో మిగిలిన రూ.2.117 కోట్లు సాధించేందుకు ఉద్యోగులు శక్తి వంచన లేకుండా కృషి చేయాలని కోరారు. ముందుగా సిబ్బంది నిర్వహించిన పరేడ్‌లో ఆయన పాల్గొని గౌరవ వందనం స్వీకరించారు. కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐ.ఆర్.ఎస్ అధికారులు బి.లక్ష్మీనారయణ, ఉపేంద్ర, పి.రవికుమార్, ఎం. నాగరాజు, జి. సీతారామరాజు సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాస రెడ్డి, మూర్తి యుగంధర్, ఈశ్వర రావు, కాకర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు .

అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగానే జగనన్న పాలన

పట్నంబజారు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలను అనుసరిస్తూ.. మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ఆశయాలకు ఊపిరి పోస్తూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ చెప్పారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశించిన సామాజిక సాధికారతను ఆచరణలో చేసి చూపెట్టిన ఘనత సీఎం వై.ఎస్.జగన్‌కే దక్కుతుందన్నారు. రానున్న రోజుల్లో తిరిగి ముఖ్యమంత్రిగా జగనన్నను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ నేతలు, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు పఠాన్ ముంతాజ్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ వై షేక్, రామకృష్ణా రెడ్డి, దాసరి జాన్‌బాబు, గనిక ఝాన్సీరాణి, బి. రోజారాణి పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న మాణిక్యవరప్రసాద్

డీఆర్ఎం కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం



అభివాదం చేస్తున్న డీఆర్ఎం ఎం.రామకృష్ణ

లక్ష్మీపురం: నేడు దేశంలో స్వేచ్ఛాయుత జీవితాన్ని గడుపుతున్నామంటే దానికి కారణం అమర వీరుల త్యాగఫలం అని ప్రతి గణతంత్ర దినోత్సవాన్ని పండుగ వాతావరణంలో జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందని గుంటూరు రైల్వే డివిజన్ డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక నల్లపాడులోని రైల్వే పరేడ్ గ్రౌండ్స్‌లో శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా డీఆర్ఎం రామకృష్ణ డివిజన్ సిబ్బంది, రైల్వే ఆర్పీఎఫ్, జీఆర్పీ, ఐఆర్పీ సిబ్బంది సమక్షంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీరుల అడుగు జాడల్లో నడుచుకోవాల్సిందిగా సూచించారు. అదే విధంగా ఈ రోజు దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గుంటూరు రైల్వే డివిజన్ మరింత అభివృద్ధి పథంలో నడిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో శునకాల ప్రదర్శన, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం ఆర్. శ్రీనివాస్, సైమన్, ఆయా విభాగాధిపతులు డివిజన్ సిబ్బంది, డివిజనల్ సెక్యూరిటీ కమీషనర్, ఆర్పిఎఫ్, జీఆర్పి పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీకృష్ణకు గ్యాలంటరీ మెడల్

సత్తెనపల్లి: చత్తీస్‌ఘడ్ వద్ద కోబ్రా–210 విభాగంలో విధులు నిర్వహిస్తూ 2021 ఏప్రిల్ 3న మావోయిస్టుల ఘాతుకానికి పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శాఖమూరి మురళీకృష్ణ వీర మరణం పొందిన విషయం తెలిసిందే. 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయన గ్యాలంటరీ మెడల్‌కు ఎంపికయ్యారు. ఈ మెడల్ కాపీని సీఆర్పీఎఫ్ కమాండెంట్ ఆర్కే పాండా శుక్రవారం సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామంలో ఉన్న శాఖమూరి మురళీకృష్ణ ఇంటికి వచ్చి మృతుడి తల్లి విజయకుమారికి అందించారు. ముందుగా గ్రామంలో ఏర్పాటు చేసిన శాఖమూరి మురళీకృష్ణ కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమాండెంట్ ఎస్.పి.రజిత, సీఆర్పీఎఫ్ సిబ్బంది, సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ పైడి రాంబాబు, సిబ్బంది, మురళీకృష్ణ తండ్రి రవీంద్రబాబు, సోదరుడు వెంకట మోహన్ రావు పాల్గొన్నారు.

క్రెడాయ్ మెగా ప్రాపర్టీ షో ప్రారంభం

పాత గుంటూరు: క్రెడాయ్ ప్రాపర్టీ షోలో అనేక భవన నిర్మాణ సంస్థలు, రియల్ ఎస్టేట్, బ్యాంకర్లు, గృహ నిర్మాణానికి సంబంధించిన వివిధ రంగాల వారు ఒకే చోట ప్రదర్శనలో పాల్గొనడం కష్టమర్లకు ఉపయోగకరమని మంత్రి విడదల రజిని అన్నారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ఆధ్వర్యంలో మెగా ప్రాపర్టీ షో 2024 గుంటూరు రింగు రోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైద్యఆరోగ్య శాఖామంత్రి విడదల రజిని, నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మేయర్ కావటి మనోహర్ నాయుడు, మాజీ హోం మంత్రి, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, రాజ్యసభ సభ్యులు ఆళ్ళ అయోధ్య రామిరెడ్డి, మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, రావెల కిషోర్‌బాబు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేశారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు టీం ప్రాపర్టీ షోను ప్రతి సంవత్సరం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ ప్రజల సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ప్రాపర్టీ షోలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి మాట్లాడుతూ ప్రాపర్టీ షో ఏర్పాటు చేసిన క్రెడాయ్ సభ్యులందరినీ అభినందించారు. క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రెసిడెంట్ మామిడి రాము మాట్లాడుతూ ఈ ప్రాపర్టీ షో ముఖ్య ఉద్దేశ్యమని, అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఇన్ఫ్రాస్ట్రక్చర్స్, ఫ్లాట్స్, మెటీరియల్స్, బ్యాంకు లోన్స్ అన్ని ఒకేచోట ఏర్పాటు చేయడం జరిగిందని, కస్టమర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. క్రెడాయ్ చైర్మన్ ఆళ్ల శివారెడ్డి మాట్లాడుతూ క్రెడాయ్ గుంటూరు చాప్టర్ ప్రతి సంవత్సరం సొంత ఇంటిని ఏర్పాటు చేసుకొనే వారికి ఎంతో మేలైన సేవలందిస్తోందని, అనేక భవన నిర్మాణ సంస్థలు ఇన్ఫ్రాస్ట్రక్చర్స్, ఫ్లాట్స్, మెటీరియల్స్, బ్యాంకులు కూడా సేవలందించడం అభినందనీయమన్నారు.

క్రెడాయ్ గుంటూరు చైర్మన్ ఆరుమళ్ళ సతీష్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మెట్టు సాంబశివారెడ్డి, సెక్రటరి తియ్యగూర వినోద్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ శివనాగేశ్వరరావు, రామాకాంత్, ప్రాపర్టీ షో కన్వీనర్ గుంటూరు వెంకటరెడ్డి, ఇ.సి. మెంబర్స్ పి. వేణుగోపాల్ రెడ్డి, బోనా శివనాగబాబు తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి విడదల రజిని

రాజ్యాంగ స్ఫూర్తి కలిగి ఉండాలి



నగరంపాలెం: ప్రతి ఒక్కరూ రాజ్యాంగ స్ఫూర్తిని కలిగి ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్, క్యాంప్ కార్యాలయాల ఆవరణల్లో జరిగిన గణతంత్ర వేడుకల్లో జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హాఫీజ్ జాతీయ జెండా ఆవిష్కరించారు. జిల్లా ఎస్పీ ఆరిఫ్ హాఫీజ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగమన్నారు. ఏఎస్పీలు ఎ.శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు, ఆర్ఐలు, కార్యాలయ అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

విజిలెన్స్ కార్యాలయంలో..

గుంటూరు రీజినల్ విజిలెన్స్/ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం కార్యాలయంలో ఆవరణలో గణతంత్ర వేడుకలు నిర్వహించారు. విజిలెన్స్ ఎస్పీ కె.ఈశ్వర రావు జాతీయ జెండాను ఆవిష్కరించి, గణతంత్ర దినోత్సవ విశిష్టతను వివరించారు. సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విజ్ఞాన్ నిరులలో ఘనంగా రిపబ్లిక్ డే



జెండావందనం చేస్తున్న డాక్టర్ లావు రత్తయ్య

గుంటూరు రూరల్: స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం కలిగిన రాజ్యాంగంతో కూడిన మహత్తర చరిత్ర కలిగిన దేశం మన భారతదేశమని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య తెలిపారు. శుక్రవారం పెదపలకలూరులోని విజ్ఞాన్ నిరుల కళాశాలలో 75వ రిపబ్లిక్ డే వేడుకలను ఘనంగా జరిపారు. కార్యక్రమంలో జెండా ఆవిష్కరణ చేసి స్వాతంత్ర్య సమరయోధుల విజయ గాథలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో సిబార్ హాస్పిటల్ పిడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ సాయిశంకర్, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీ రాధిక, అనురాధ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అలరించిన గణతంత్ర వేడుకలు

నరసరావుపేట: స్థానిక సత్తెనపల్లిరోడ్డులోని డీఎస్ఎ క్రీడా మైదానంలో శుక్రవారం 75వ గణతంత్ర వేడుకలు జిల్లా యంత్రాంగం ఘనంగా నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు సయ్యద్ జనాబ్ బేగం, బి.వెంకటలక్ష్మిలను జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ సత్కరించారు. వివిధ శాఖలు నిర్వహించిన శకటాల ప్రదర్శనలో విద్యాశాఖ శకటానికి ప్రథమ బహుమతి, వ్యవసాయ అనుబంధ శాఖల శకటానికి ద్వితీయ బహుమతి రాగా, గృహ నిర్మాణ శాఖ శకటానికి తృతీయ బహుమతి లభించింది.

జగనన్న స్ఫూర్తితో బజరంగ్ సేవ



వెద్య శిబిరానికి వచ్చిన చేబ్రోలు గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

- ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- చేబ్రోలులో రెండవ రోజు 1121 మందికి నేత్ర. గుండె వైద్య పరీక్షలు

చేబ్రోలు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు అందిస్తున్న సంక్షేమ ఫలాల స్ఫూర్తిగా బజరంగ్ ఫౌండేషన్ జగన్నామ సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. చేబ్రోలు హైస్కూల్ రోడ్డు సమీపంలో జీబీసీ రహదారి పక్కన జగన్నామ సంక్షేమ సంగమం శిబిరం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం 1121 మందికి పైగా కంటి, గుండె వైద్యపరీక్షలు చేయించుకున్నారు. వీటితో పాటు ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకున్నారు. తొలిరోజు గురువారం 1287 మంది బజరంగ్ సేవలను వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఈ రెండు రోజులలో యాంజియోగ్రామ్ అవసరమైన వారిని సోమవారం ఉదయం ప్రత్యేక వాహనంలో విజయవాడ తీసుకెళ్లి వైద్య సేవలు అందించటం జరుగుతుందని తెలిపారు. ఉచిత నేత్ర వైద్య పరీక్షలు అనంతరం అవసరమైన వారికి ఏడు పని దినాల్లో కళ్లజోళ్ల పంపిణీ, మీ గుండె పదిలం కార్యక్రమంలో ఉచిత గుండె పరీక్షలు, అవసరమైన వారికి యాంజియోగ్రామ్ నిర్వహించి సమస్య ఉన్న వారికి స్టంట్స్, బైపాస్ సర్జరీలు చేయించటం జరుగుతుందన్నారు. దివ్యాంగ దర్శిని కార్యక్రమంలో దివ్యాంగులకు ట్రై సైకిల్స్, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడ్‌లు సమకూరుస్తున్నట్టు వివరించారు. ఇప్పటి వరకు 87 కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని త్వరలో మరికొన్ని గ్రామాల్లో ఈ కార్యక్రమాలను విస్తరిస్తామని తెలిపారు. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా బజరంగ్ ఫౌండేషన్ సేవా కార్యక్రమాల పరంపర కొనసాగిస్తోందని అంబటి మురళీకృష్ణ తెలిపారు. కాగా, వృద్ధులు, మహిళలు, వికలాంగులను శిబిరానికి తీసుకువచ్చి, పరీక్షలు నిర్వహించి తిరిగి పంపించడానికి బజరంగ్ ఫౌండేషన్ వాహనాలు ఏర్పాటు చేయడంపై గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా ప్రారంభమైన బైబిల్‌మిషన్ మహోత్సవాలు

పెదకాకాని: లోకరక్షకుడైన ఏసుప్రభువు దివ్య ఆశీర్వాదములు సకల జనులకు లభించాలనే ఏకైక లక్ష్యంతో, ప్రపంచశాంతి కోసం బైబిల్‌మిషన్ మహోత్సవములు నిర్వహిస్తున్నట్లు మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్‌కిరణ్ అన్నారు. దైవజనులు ఫాదర్ ఎం దేవదాసు అయ్యగారికి దేవుడు బయలు పరచిన బైబిల్ మిషను 86వ మహోత్సవాలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట విశాలమైన పందిళ్లలో కనుల పండుగగా ప్రారంభమయ్యాయి. మహోత్సవాల ప్రాంగణం దివ్య దేవుని దీవెనలు, ఆశీర్వాదాలకు వేదికగా మారింది. రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, కేరళ, బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బైబిల్ మిషన్ అధ్యక్షుడు, మహోత్సవాల కన్వీనర్ రెవరెండ్ జె.శామ్యేల్‌కిరణ్ మాట్లాడుతూ క్రైస్తవ భక్తులలో ఆధ్యాత్మికత పెంపొందించేందుకు క్రీస్తు ప్రభువు చూపిన ప్రేమ, శాంతి, కరుణ, క్షమాపణ తదితర ఉత్తమ గుణాలను ప్రతి ఒక్కరిలో కలిగించేందుకు ఈ మహోత్సవాలు దోహదపడతాయన్నారు. ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకూ నాలుగు రోజులపాటు బైబిల్ మిషన్ మహోత్సవాలు జరుగుతాయన్నారు. మొదటిరోజు శుక్రవారం బైబిలుమిషన్ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి జాన్‌దేవదాసు, సెక్రటరీ రెవరెండ్ కె ప్రశాంత్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి సుధాకర్, రెవరెండ్ జె ఆగమనరావు, రెవరెండ్ ఎం రవి, గవర్నింగ్ బాడీ సభ్యులు సభావేదికకు చేరుకున్నారు. రెవరెండ్‌లు జె వినోద్‌కుమార్, డి శామ్యేల్ కిరణ్, జాయింట్ సెక్రటరీ డి సుధాకర్, రెవరెండ్ కె బాబు దేవదాసు, రెవరెండ్ సీహెచ్ షాలేమ్ శరత్‌లు వాక్యోపదేశాలు అందించారు.



వాక్యోపదేశం చేస్తున్న వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ పి.జాన్‌దేవదాసు



ఉత్సవాలకు తరలివచ్చిన భక్తులు

నేటి కార్యక్రమాలు

బైబిల్‌మిషను మహోత్సవాలలో భాగంగా రెండవరోజు శనివారం తెల్లవారుజామున 5 గంటలకు ధ్యాన కార్యక్రమం ఉంటుందన్నారు. వాక్యోపదేశములు బైబిల్‌మిషన్ అధ్యక్షుడు రెవరెండ్ జె శామ్యేల్ కిరణ్, రెవరెండ్ కె అలగ్జాండర్, రెవరెండ్ పి దేవకుమార్,రెవరెండ్ కె ప్రశాంత్‌కుమార్‌లు అందిస్తారు. పశ్చిమ గోదావరి జిల్లా సంగీత బృందం క్రైస్తవ గీతాలు ఆలపించనున్నారు.